క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రశంసనీయం



నకరికల్లు: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రశంసనీయమని వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నర్సింగపాడులో పీహెచ్‌సీ డాక్టర్ వి.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మారుమూల పల్లెలకు సైతం 104 వాహనం పంపించి ప్రజలకు వైద్యం చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. దూరప్రాంతాల ప్రజలకు ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగు రామకోటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో వీధి కుక్కల బెడద



నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లిలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉండడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా జానపాడు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో విద్యార్థులు భయపడిపోతున్నారు. పిల్లలు కుక్కకాటుకు గురవుతారని ఆందోళన పడాల్సివస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే కుక్కల బెడద నుంచి కాపాడాలని వారు పంచాయతీ అధికారుల్ని కోరుతున్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



అమరావతి: జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని స్థానిక జన చైతన్య సమితి నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి జన చైతన్య సమితి ప్రతినిధి అనిల్ కుమార్, గుడ్ షెఫర్డ్ సంస్థ కో-ఆర్డినేటర్ తండు లక్ష్మణ్, కర్ల సుభాష్ చంద్రబోస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జన చైతన్య సమితి నైపుణ్య శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాటూరి ఆసుపత్రిలో వృద్ధుడికి పింఛన్ పంపిణీ



ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్లకు చెందిన కూరపాటి కోటయ్య అస్వస్థతకు గురై గుంటూరు సమీపంలోని కాటూరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 8వ వార్డు వలంటీరు తాడువాయి శ్వేత శ్రమకోర్చి ఆసుపత్రికి వెళ్లి ఆయనకు పింఛన్ నగదును అందించింది. ఆపదలో ఉన్న తనను వెతుక్కుంటూ వచ్చి మరీ పింఛన్ అందించటం కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని కోటయ్య సంతోషం వ్యక్తం చేశాడు. ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థ తమలాంటి వారికి తోడుగా నిలుస్తోందని చెప్పాడు.

చికిత్స పొందుతూ అగ్ని ప్రమాద బాధితురాలి మృతి

అచ్చంపేట: అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించి విఫలమై, తీవ్ర గాయాలపాలైన దాములూరి మేరీలు (56) గత 45 రోజులుగా మృత్యుతో పోరాడుతూ గురువారం ఉదయం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెదపాలెం ఎస్సీ కాలనీలో జూన్ 18న జరిగిన అగ్ని ప్రమాదంలో 14 పూరి పాకలు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ సమయంలో 18 నెలల పాప ఉయ్యాలలో నిద్రిస్తుండగా కాపాడేందుకు ప్రయత్నించి అమ్మమ్మ దాములూరి మేరీలు తీవ్ర గాయాలపాలైంది. ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటి నుంచి మేరీలు మృత్యువుతో పోరాడుతూనే ఉంది. వైద్యులు ఆమెను బతికించేందుకు తీవ్ర ప్రయత్నం చేసినా, ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం మేరీలు మృతి చెందారు.

కలుపు నివారణతోనే తెగుళ్ల అదుపు



పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు



పత్తి చేలో అంతరకృషి చేస్తున్న రైతు

- పత్తిలో కలుపు సమస్యలతో దిగుబడులపై ప్రభావం
- 12 నుంచి 51 శాతం వరకు తగ్గే ప్రమాదం

అమరావతి: పత్తి సాగు పెట్టుబడిలో సుమారు 30శాతానికి పైగా కలుపు నివారణకే ఖర్చు చేయాల్సి వస్తోంది. కలుపు మొక్కలు అధికంగా ఉంటే దిగుబడి, నాణ్యతలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పత్తిలో కలుపు సమస్య అధికం కావడానికి కారణాలు ఉన్నాయి. సమయాభావం వల్ల పొలాన్ని సరిగా దున్నకపోవడం, సిఫార్సు చేసిన దాని కంటే ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం, నీటి యజమాన్య పద్ధతులు సరిగా పాటించకపోవడం వంటి కారణాల వల్ల కలుపు అధికంగా వస్తుంది దీనివల్ల దిగుబడిలో 12 నుంచి 51 శాతం వరకు తగ్గుతుంది. నాణ్యత పడిపోవడమే కాకుండా తెగుళ్లు, పురుగులు మొక్కల్ని ఆశ్రయిస్తాయి. మొక్కలు నాటిన తర్వాత తొలి ఆరు వారాల దశ కలుపు నివారణకు ఎంతో కీలకమైంది. ఈ సమయంలో పైరులో కలుపు లేకుండా చూసుకోవాలి. ఏ రకం కలుపు మొక్కల్ని ఏ రకం మందులతో నిర్మూలించాలో రైతులు ముందుగా అవగాహన చేసుకోవాలి. సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువుల్ని వాడాలి. ప్రతి 10 రోజులకు ఒకసారి కూలీలతో కలుపు తీయించాలి. అయితే, గ్రామాల్లో పొలాల విస్తీర్ణానికి తగ్గట్టుగా కూలీల లభ్యత ఉండటం లేదు. ప్రస్తుతం రేట్లు కూడా పెరగడంతో కలుపుల నివారణకు కూడా రైతులు రసాయనిక మందుల పైనే ఆధారపడుతున్నారు.

అంతర కృషితో పలు ఉపయోగాలు

పత్తి చేలలో విత్తనాల్ని నాటిన 13వ రోజు నుంచి అంతర కృషి చేయడం వల్ల 50శాతం వరకు కలుపును నివారించవచ్చు. కాని నేడు పశువుల అరకలతో వ్యవసాయం తగ్గిపోవడంతో చేలల్లో అంతరకృషికి కూడా యంత్రాల్ని నమ్ముకోవాల్సివస్తోంది. ఇవి గ్రామాల్లో రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. తప్పని పరిస్థితుల్లో కూలీలతో కలుపు తీయించాల్సిన రావడంతో ఖర్చు పెరుగుతోంది. అంతరకృషి వల్ల కలుపు మొక్కలు పూర్తిగా నశించక పోయినా, తాత్కాలికంగా మొక్కకు హాని కలుగకుండా నివారించవచ్చు. అంతేకాక వేరు భాగానికి గాలి తగలడం వల్ల ఏపుగా పెరిగే అవకాశం ఉంది.

కలుపు మందుల్ని నిర్ణీత మోతాదులోనే వాడాలి

కలుపు మందులు వేసినప్పటికీ పత్తి పైరులో 25 నుంచి 30రోజుల వరకు వ్యవసాయ పనిముట్లతో అంతర కృషి చేయాలి. పంటకు సరిపోయే కలుపు మందుల్ని నిర్ణీత మోతాదులో సరైన సమయంలోనే వాడాలి. విత్తనం వేయగానే 24నుంచి 48గంటల్లోపు పొలంలో పదును లేకపోతే యూరియాని, పదును ఉంటే స్టాంప్ అనే రసాయనిక మందును పిచికారీ చేయాలి. కలుపు మందును పవర్ స్ప్రేయర్‌తో కాకుండా హ్యాండ్ స్ప్రేయర్‌తోనే చల్లాలి. భూమిలో బాగా పదును ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు చల్లడం లాభదాయకం. మందులు వేసిన రోజున వర్షం పడకుండా ఉండాలి. ఉదయం లేదా సాయం కాలం మాత్రమే పిచికారీ చేయాలి.

ఎస్‌కే.ఎఫ్. అహ్మద్,
మండల వ్యవసాయాధికారి

ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం

ఎన్జీఓస్ సంఘ నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఎన్‌జీఓస్ సంఘం నేతలు

నకరికల్లు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీరుస్తారన్న పూర్తి విశ్వాసం తమకు ఉందని ఏపీ ఎన్జీఓస్ సంఘం నరసరావుపేట తాలూకా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తెలిపారు. విజయవాడలో ఆగస్టు 21,22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓస్ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను గురువారం నకరికల్లులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 21వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్జీఓల సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించేందుకు రాష్ట్రంలోని 10వేల మంది ఉద్యోగులు కూడా పాల్గొననున్నట్లు చెప్పారు. మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి మండలంలోనూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసరావుపేటలోని ఎన్జీఓ హోం నుంచి సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏపీ ఎన్జీఓస్ సంఘం తాలూకా కార్యదర్శి మాదాసు ఆనందనాథ్, ట్రెజరర్ సీహెచ్.కోటిరెడ్డి పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

క్రోసూరు: అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీడీవో బి.మహేష్ తెలిపారు. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అవయవ దానంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అవయవ దానం ఎంతో గొప్పదన్నారు. ఆరోగ్యవంతులైన ప్రజలు మరణించిన తరువాత ఇతరులకు ఉపయోగపడేలా అవయవ దానానికి ముందుకు రావాలని తెలిపారు. కొంతమంది అవయవ దానాలు ఇచ్చి ఏకకాలంలో ఎంతో మందికి ఉపయోగపడుతున్న సంఘటనల్ని నిత్యం మనం చూస్తూనే ఉన్నామని పేర్కొన్నారు. అలాంటి దాతల జన్మధన్యమని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని అందరూ ముందుకు రావాలన్నారు. అవదానం చేయదలుచుకున్న వారు వివరాలతో డిక్లరేషన్‌ను ఏదైనా స్వచ్ఛంద సంస్థ లేదా వైద్యశాఖకు అందజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల తనిఖీలో అశ్రద్ధ వద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

ముప్పాళ్ల: మండలంలోని ప్రతి గ్రామంలో ఓటర్ల జాబితాలోని వివరాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ తెలిపారు. ఒకే ఇంటి నంబర్‌పై అధిక సంఖ్యలో ఓట్లు నమోదై ఉంటే వారి నుంచి దరఖాస్తులు నమోదు చేయించాలని చెప్పారు. తన కార్యాలయంలో బీఎల్‌ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులతో ఓటుహక్కు కోసం దరఖాస్తులు చేయించాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాల తనిఖీ ప్రక్రియ ఈ నెల 21లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాదు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష



తల్లిపాల వారోత్సవాలలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి

బొల్లవరం(ముప్పాళ్ల): బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి చెప్పారు. మండలంలోని బొల్లవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్ని గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్ జయలక్ష్మి మాట్లాడుతూ తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటికే పౌష్టికాహార కిట్లు అందిస్తోందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బద్దిగం వెంకటేశ్వర రెడ్డి, మహిళా పోలీసు రమ్యకృష్ణ, ఏఎన్ఎం అనూరాధ, ఎంఎల్‌హెచ్‌పీ కమల, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలకు సైన్స్ ప్రాజెక్ట్‌లు పరిష్కారం చూపాలి

-డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

నరసరావుపేట రూరల్: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ తయారు చేసే విధానంపై సైన్స్ ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలపై బాల్యదశ నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వాటికి పరిష్కార మార్గాలను చూపే బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్ట్‌ల ద్వారా జిల్లాకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ మధుకుమార్, ఏఎంఓ శ్రీనివాసరావు, జీసీడీఓ రేవతి, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ సీతారామయ్య, రీసోర్స్ పర్సన్స్ నాగేశ్వరరావు, అప్పారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

9 నుంచి 'నా భూమి-నాదేశం'

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, సచివాలయం సిబ్బందితో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఈనెల 9 నుంచి నా భూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగస్టు 9న ప్రధానమంత్రి సందేశంతో శిలాఫలకం ఆవిష్కరణ, ఆగస్టు 11న పర్యావరణం పచ్చదనాన్ని కాపాడడం కోసం వసుధకు వందనంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. తదుపరి ఆగస్టు 15 వరకు అన్ని పంచాయతీల్లో మొక్కలు నాటడంతో పాటు ఆయా పంచా యతీల్లో దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధులు, వీరులకు సన్మానం, సత్కారం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ఖాళీ స్థలాల్లో అమృత్ సరోవర్ ఏర్పాటు చేసిన చెరువు కట్టలపై తదితర ప్రదే శాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఆయా పంచాయతీల్లో తప్పనిసరిగా పీఎం సందేశంతో కూడిన శిలాఫలకం ఏర్పాటు చేయాలని తెలి పారు. ఏపీఓ ఎస్. ఆంజనేయ రాజు, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవ్ ఇండియా విజయవంతం చేయాలి

చిలకలూరిపేట టౌన్: క్విట్ ఇండియా స్ఫూర్తితో మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవాలని వామపక్ష కార్మికసంఘాల నాయకులు చెప్పారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 9తేదీ విజయవాడలో జరగనున్న ధర్నా ను విజయవంతం చేయాలని చెప్పారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలో కార్యక్రమం ప్రచారం చేయటానికి ప్రచార జీపు యాత్ర శుక్రవారం ఉదయం చిలకలూరిపేటలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వై రాధాకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కమిటీల గడువు పొడిగింపు

రొంపిచర్ల: మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మేనేజ్‌మెంట్ కమిటీల గడువును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పొడిగించిన ఆరు మేనేజ్‌మెంట్ కమిటీల్లో నాలుగు మేనేజ్‌మెంట్ కమిటీలు పాతవారే తిరిగి నియామకం కాగా, రొంపిచర్ల, సంతగుడిపాడు పీఏసీఎస్‌లకు నూతన కమిటీలను నియమించారు. నూతనంగా రొంపిచర్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మేడికొండ వీరారెడ్డి, సంతగుడిపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చింతగుంట అంజిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. విప్పర్ల రెడ్డిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పొలిమేర వెంకటరెడ్డి, బుచ్చిబాపన్నపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కేతు పెద్దచౌడారెడ్డి, సుబ్బయ్యపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వట్టికొండ ఆంజనేయులు, అన్నవరం పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా ద్రోణాదుల చిన రమాణారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించారు.

కారు ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని తండ్రీ కొడుకులు గాయాలపాలైన ప్రమాదంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చిలకలూరిపేట మద్దినగర్‌లో నివాసం ఉంటున్న తండ్రీకొడుకులు షేక్ మౌలాలి, మస్తాన్‌వలి ఈ నెల 2న గణపవరంలో పింఛను సొమ్ము తీసుకుని తమ ద్విచక్ర వాహనంపై తిరిగి చిలకలూరిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా మంగళగిరి నుంచి నంద్యాల వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. దీంతో తండ్రి మౌలాలి తీవ్రగాయాలపాలుకాగా జీజీహెచ్‌కు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో గాయాలపాలైన మస్తాన్‌వలి చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సుబ్బారాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వృద్ధుడి జాడ కోసం ఫిర్యాదు



నాదెండ్ల: సాతులూరు గ్రామానికి చెందిన బాపయ్య చౌదరి ఈ నెల 1 నుంచి కనిపించటం లేదంటూ నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపయ్య చౌదరి కొన్నేళ్ళ క్రితం ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ, పన్నెండేళ్ల క్రితం పెరాలసిస్ రావడంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ప్రతినెలా రూ.3 వేలు పింఛను పొందుతున్నాడు. ఈ నెల 1వ తేదీన పింఛను నగదు తీసుకున్న బాపయ్య చౌదరి, దాన్ని ఇంట్లో కుటుంబ సభ్యులకు అందించాడు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకులాడినా జాడ లేకపోవటంతో, చౌదరి భార్య సీతామహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ జె బలరామిరెడ్డి 9440900881 నంబరుకు సమాచారమందించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని హనుమాన్ నగర్ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీర్ సెక్రటరీ బలరాం నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ వెంకయ్య తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇల్లు కట్టకుండానే బిల్లులు మంజూరు చేసినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సంక్షేమం అర్హుల దరిచేరాలి

జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్ రెడ్డి



వేదికపై ప్రజా ప్రతినిధులు

రొంపిచర్ల: మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎండీవో కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపన కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మండలంలో అధికారులు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి



డాక్టర్ నబీషా (ఫైల్)

రొంపిచర్ల: మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై రొంపిచర్ల, సంతగుడిపాడు మధ్యలో ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో కర్లకుంట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ షేక్ అబ్దుల్ నబీషా (40) గురువారం మృతి చెందారు. రొంపిచర్ల గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై డాక్టర్ నబీషా కర్లకుంట గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టటంతో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయిన నబీషాను చూసిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్యశాల్లో డాక్టర్ నబీషా మృతదేహాన్ని ఆర్ఎంపీ, పీఎం పారా మెడికల్ అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్లు వాకా అంకిరెడ్డి, జోగేశ్వరబాబు, భాస్కర్‌రెడ్డి, సంగీతరావు, హరిబాబు, మస్తాన్‌వలి, అంజిరెడ్డి, గోదా రమేష్ కుమార్, వెంకటేశ్వర్లు, నాసరయ్య, రమేష్ బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చింపివేత

ఈపూరు: మండలంలోని శ్రీనగర్ గ్రామం వద్ద వైఎస్సార్ సీపీకి ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చించి వేశారు. అనేక సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ వివిధ కార్యక్రమాలకు గ్రామస్తులు ఆ స్థానంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే, నారా లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం సందర్భంగా తెదేపా పార్టీకి చెందిన వారు ఫ్లెక్సీని కావాలనే చింపివేశారని శ్రీనగర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే కార్యక్రమాలకేనా యువగళం ప్రవేశపెట్టిందని గ్రామస్తులు అంటున్నారు. సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'నవోదయం'పై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు



సమావేశానికి హాజరైన అర్జీదారులు

గతనెల 14న నిర్వహించిన నవోదయంలో వ్యాపారాల కోసం అర్జీలు పెట్టుకున్న ఎస్సీ, ఎస్టీలకు గురువారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రతినెలా 14వ తేదీన ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి కోసం నవోదయం నిర్వహిస్తున్న విషయం విదితమే. వివిధ రకాల వ్యాపారాలు, తద్వారా పొందాల్సిన బ్యాంకు రుణాల గురించి జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి బీజే బెన్నీ, నోడల్ అధికారి పి.సంజీవరావు వివరించారు.

–నరసరావుపేట

ఫణిదం పీహెచ్‌సీలో కిల్కారిపై ఆశాలకు శిక్షణ

సత్తెనపల్లి(ముప్పాళ్ల): సత్తెనపల్లి మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశ కార్యకర్తలకు కిల్కారి, మొబైల్ అకాడమీపై అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోర్సు స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు పాల్గొన్నారు. మాతాశిశు సంరక్షణ సేవలు, హైరిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. సత్తెనపల్లి డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగపద్మజ, పల్నాడు జిల్లా డీసీఎం సురేష్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, మణిరావు, సంపూర్ణదేవి, వరలక్ష్మి, మార్గరెట్ పాల్గొన్నారు.

6న పురోహిత సంఘ సదస్సు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): శ్రీ వేద గాయత్రీ పురోహిత సంఘం ఆధ్వర్యంలో పల్నాడు, బాపట్ల జిల్లాల సంయుక్త పురోహిత ఆత్మీయ సదస్సు ఈ నెల 6న సత్తెనపల్లిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కలవకొలను సీతారామశాస్త్రి గురువారం తెలిపారు. ఉదయం 9గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం తాలూకా సెంటర్‌లోని మన్నెం రెసిడెన్స్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9849549091 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు